RNI NO. APTEL/2014/58326
నవతరం
తెలుగు దినపత్రిక

సంపుటి : -13 సంచిక : 129 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి
శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి
20-03-2026 శుక్రవారం వెల : 1 /- పేజీలు : 4

# జిల్లా సమగ్ర అభ్యున్నతికి సమిష్టిగా కృషి

జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

(నవతరం -శ్రీకాకుళం)

ఉగాది నూతన శ్రీ పరాభవ నామ సంవత్సరం జిల్లా సమగ్ర అభ్యున్నతికి సమిష్టిగా కృషి చేద్దామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలు స్థానిక డా,బి.ఆర్.అంబేద్కర్ కళావేదికలో గురువారం ఘనంగా జరిగాయి. జిల్లా కలెక్టర్, శాసన సభ్యులు పంచాంగ శ్రవణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి చెందే విధంగా ప్రణాళికతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. తెలుగు ప్రజలకు ఉగాది పండుగ ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఉగాది పచ్చడిలో ఆరు రుచులు ఎలా ఉంటాయో కష్టసుఖాలను అధిగమించి సానుకూల దృక్పథంతో ముందు అడుగు వేయాలని అన్నారు. అందరి జీవితాల్లో పరాభనామ సంవత్సరం కొత్త వెలుగులు తీసుకురావాలని అన్నారు. జిల్లా మంత్రుల తోడ్పాటుతో జిల్లా సర్వతోముఖాభివృద్ధి దిశగా పయనించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అందరికీ ఉగాది సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.
శాసన సభ్యులు గొండు శంకర్ మాట్లాడుతూ శ్రీ పరాభవ నామ సంవత్సరంలో ప్రజలు ఆయురారోగ్యంతో అభివృద్ధి ఫలాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ప్రజలకు ఉగాది సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.
జిల్లా కలెక్టర్ తో సహా అధికారులు సాంప్రదాయ వస్త్రాలను ధరించి వేడుకల్లో పాల్గొవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మంగళ వాయిద్యాల మధ్య జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. వేద పండితులు వేదమంత్రాలతో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే ను ఆశీర్వచనాలు అందించారు. అనంతరం వేదపండితులను దుశ్శాలువతో సన్మానించి ప్రశంసా పత్రాలను





అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు శివ శ్రీ నృత్య కళానికేతన్ శ్రీకాంత్ రఘుపత్రుని కళా బృందం ప్రదర్శించిన కూచిపూడి, కోలాటం, ఏకపాత్రాభినయం నృత్యాలు ఆహుతులను అలరించాయి.కవి సమ్మేళనం: ప్రఖ్యాత కవులు ఆలపించిన కవితలు అందరినీ ఆకట్టుకున్నాయి.శ్రీ పరాభవ నామ సంవత్సర నూతన సంవత్సర ఉగాది పురస్కరించుకొని దైవజ్ఞ ధర్మపురి గౌరీ శంకర్ శాస్త్రీ పంచాంగ శ్రవణం చేశారు. ఈ ఏడాది రాశి ఫలితాలను ఆలపించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కలెక్టర్ దొనక పృథ్వీ రాజ్, జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మణ రావు, జిల్లా విద్యా శాఖాధికారి రవి బాబు, జిల్లా ఉద్యాన వన శాఖ సహాయ సంచాలకులు వర ప్రసాద్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవ రావు, శ్రీకాకుళం, టెక్కలి ఆర్డీవో లు సాయి ప్రత్యూష, ఎమ్.కృష్ణ మూర్తి, పర్యాటక శాఖ అధికారి పి.నారాయణ రావు, దేవాదాయ శాఖ కార్వాహక అధికారి ప్రసాదరావు, తహసీల్దార్ గణపతి, కవులు, కళాభిమానులు, తదితరులు, పాల్గొన్నారు.

# అకాల వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

- రైతులకు పూర్తి సహాయం అందిస్తాం
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



నవతరం -అమరావతి

రాష్ట్రంలో రాబోయే 3-4 రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు (గంటకు 30-40 కి.మీ వేగంతో) వడగళ్లతో కూడిన అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గురువారం అత్యవసర సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఇంచార్జ్ కమిషనర్, ఉద్యానవన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు, ఇతర ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం/ద్రోణి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయని, ముఖ్యంగా రాయలసీమ, కోస్తాంధ్ర , ఉత్తరాంధ్ర జిల్లాల్లో తీవ్ర ప్రభావం ఉండే అవకాశముందని మంత్రి తెలిపారు. అరటి, మామిడి, మిర్చి, మొక్కజొన్న వంటి పంటలకు నష్టం కలిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను త్వరితగతిన గుర్తించి, నష్టాన్ని నమోదు చేయాలని సంబంధిత అధికారులకు మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయం అందిస్తుందని హామీ ఇచ్చారు.

## రైతులకు సూచనలు

పండిన పంటలను సాధ్యమైనంత త్వరగా సేకరించి భద్రపరచాలి
వడగళ్ల వాన, ఈదురుగాలుల సమయంలో పొలాల్లో ఉండకూడదు
వ్యవసాయ యంత్రాలు, పరికరాలను సురక్షిత ప్రదేశాల్లో ఉంచాలి
పండ్ల తోటలకు రక్షణ చర్యలు తీసుకోవాలి
పిడుగులు పడే అవకాశం ఉన్నందున చెట్ల కింద నిలబడకూడదు, సురక్షిత ప్రదేశాల్లో ఆశ్రయం పొందాలి. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. అకాల వర్షాలతో కొంతమేర ఉష్ణోగ్రతలు తగ్గి ప్రజలకు ఉపశమనం లభించినప్పటికీ, పంటలు, ఆస్తులకు నష్టం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి, నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

# రూ.4 కోట్లతో అరసవల్లి ఇంద్ర పుష్కరిని అభివృద్ధి

- గౌరవ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకి ఈవో ఆహ్వాన పత్రిక అందజేత
- ఈ నెల 21 శంకుస్థాపన చేయనున్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



నవతరం-నిమ్మాడ

అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఇంద్ర పుష్కరిని ఆధునీకరణ పనులు ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవతో ఈ పనులకు రూ. 4 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నెల 21 ఇంద్ర పుష్కరిని ఆధునీకరణ పనులకు మంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఇంద్ర పుష్కరిని అభివృద్ధికి గత ప్రభుత్వం నిధులు ఇస్తామని చెప్పినప్పటికీ సకాలంలో విడుదల కాకపోవడంతో పనులు చేపట్టలేదు. చుట్టూ ఉన్న మెట్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇంద్ర పుష్కరినికి నీరు అందించే ప్రధాన కాలువలు మూతపడ్డాయి. ఈ పనులన్నింటిని చేపట్టకపోవడం వల్ల అంతర్భాగంలో మట్టి పూడిపోయింది. ఈ పనులన్నింటినీ ఇప్పుడు చేపట్టనున్నారు. ఇప్పటికే శంకుస్థాపనకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం నిమ్మాడ మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఈవో కె.ఎన్.వి.డి.వి. ప్రసాద్, సిబ్బంది మంత్రిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

# కొత్త తరానికి వెలుగు రేఖగా తేజబాబు

- జాతీయ వేదికపై మెరిసిన యువ విద్యా ద్రష్ట
- టైమ్స్ ఆఫ్ ఇండియా అవార్డ్‌తో ఎచ్చెర్లకు గౌరవం
- నాణ్యమైన విద్యతో గుర్తింపు పొందుతున్న ఎన్ ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్






(నవతరం -శ్రీకాకుళం)

విద్యే సమాజ మార్పుకు ప్రధాన ఆయుధమనే నమ్మకంతో ముందుకు సాగుతున్న యువ నాయకుడు నడుకుదిటి తేజబాబు మరో ప్రతిష్ఠాత్మక గుర్తింపు సాధించారు. ఎన్ ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా ఉన్నత ప్రమాణాలతో విద్యను అందిస్తూ ఎచ్చెర్ల నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చిన ఆయనకు దేశస్థాయి ప్రశంసలు లభిస్తున్నాయి. ఈ నెల 18న హైదరాబాద్‌లో టైమ్స్ ఆఫ్ ఇండియా నిర్వహించిన "ఈటీ ఇండస్ట్రీ అచీవర్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ 2025-2026" అవార్డుల కార్యక్రమంలో, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తనయుడు, ఎన్ ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ డైరెక్టర్ నడుకుదిటి తేజబాబు "యంగ్ యూత్ విజనరీ లీడర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్" అవార్డును అందుకున్నారు. విద్యా రంగంలో నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నూతన పద్ధతులను అమలు చేస్తున్నందుకు గాను ఈ అవార్డును ఆయనకు ప్రదానం చేశారు. తేజబాబు వంటి యువ నాయకులు భవిష్యత్ తరాలకు మార్గదర్శకులని, విద్యతో సమాజంలో మార్పు తీసుకురాగల శక్తి ఉన్న వారని పలువురు కొనియాడుతున్నారు. తండ్రి మార్గంలో నడుస్తూ మరిన్ని విజయాలు సాధించాలని, శ్రీకాకుళం ఖ్యాతిని దేశవ్యాప్తంగా చాటాలని ఎన్ ఈఆర్ యువత ఆకాంక్షిస్తోంది. తేజబాబు సాధించిన ఈ గౌరవం పట్ల ఎన్ ఈఆర్ అభిమానులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థల ప్రతినిధులు, సంఘ నాయకులు అభినందనలు తెలియజేస్తున్నారు.

# "నోబుల్ మైండ్స్ ఒలింపియాడ్లో శర్వాణి విద్యార్థికి రాష్ట్రస్థాయి రెండవ బహుమతి"



(నవతరం -శ్రీకాకుళం)

ఏలూరు ప్రధాన కేంద్రంగా సేవలందిస్తున్న ఇంజినీర్స్ సిండికేట్ సంస్థ, ప్రతియేటా నిర్వహించే "నోబుల్ మైండ్స్" మ్యాథ్, సైన్స్, జి.కె ఒలింపియాడ్లో శ్రీకాకుళం నగరం, అరసవిల్లిరోడ్లో గల శర్వాణి విద్యాలయ విద్యార్థులు సత్తా చాటారు. నవంబర్ 30, 2025 న నోబుల్ మైండ్స్ నిర్వహించిన ఈ రాష్ట్రస్థాయి ఒలింపియాడ్లో శర్వాణి

-మిగతా 2లో

ఎడిటోరియల్

# రైతే బరువా?

'తాను సాయం చేయడు.. చేసేవాడిని కూడా చెడగొడతాడు' అన్నట్టుగా దేశ రైతాంగానికి నష్టం చేసే నిర్ణయాలు కేంద్రం నుంచి వరుసగా వెలువడుతున్నాయి. వరి, గోధుమలకు నిర్ణయించిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) గాకుండా రాష్ట్రాలు అదనంగా అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని ఉపసంహరించుకోవాలని రాష్ట్రాలను కోరడం అందులో భాగమే. నోటికాడి కూడును లాక్కోవడమనే అర్థం వచ్చేలా..రాష్ట్రాలు అందిస్తున్న కొద్దిపాటి ఆర్థిక భరోసాను కూడా అడ్డుకోవాలని ప్రయత్నించడం హేయమైన చర్య.
వరి, గోధుమల వంటి పంటలకు అందిస్తున్న ఆర్థిక బోనస్‌లను నిలిపివేయాలని, అలాగే కేంద్ర విధానాలకు అనుగుణంగా తమ నిర్ణయా లను మార్చుకోవాలని కేంద్రం రాసిన లేఖలో రాష్ట్రాలను కోరింది. సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ పార్లమెంటులో అడిగిన ప్రశ్నకు సమాధానంగా, కేంద్ర ఆర్థికశాఖ ఈ ఏడాది జనవరి 9న రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు లేఖ పంపినట్టు వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వశాఖ ధ్రువీకరించింది. వరి, గోధుమల వంటి పంటలకు బోనస్‌లను నిలిపి వేసినట్టు, వాటి స్థానంలో పప్పుధాన్యాలు, నూనె గింజలు, ఇతర పంటలను ప్రోత్సహిస్తున్నట్టు ఆ లేఖలో పేర్కొంది. దీనిద్వారా రైతుల పట్ల కేంద్రం వైఖరేంటో మరోసారి తెలియజేసినట్టు అయింది. ప్రస్తుతం వరికి కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) క్వింటాల్‌కు రూ.2,369గా ఉంది. కేరళం ప్రభుత్వం క్వింటాల్‌కు అదనంగా రూ.631 బోనస్ అందిస్తూ, మొత్తం రూ.3వేల చొప్పున చెల్లిస్తోంది. తెలంగాణ లోనూ రాష్ట్రప్రభుత్వం అదనంగా రూ.500 అందిస్తోంది. ఇలా మరికొన్ని రాష్ట్రాల్లో ఒక్కో పంటకు అదనపు ఆర్థిక సాయాన్ని అందిస్తున్నాయి. ఈ బోనస్‌లను తొలగించాలన్న కేంద్రం ప్రతిపాదన ఆమోదం పొందితే, కేరళ రైతులతో పాటు మిగతా రాష్ట్రాల అన్నదాతలకు నష్టదాయకమే. ఇప్పటికే రాష్ట్రాలకు ఉన్న హక్కులను కేంద్రం లాగేసుకుంది. సహాయకచర్యల విషయంలోనూ పెత్తనం చెలాయిస్తే రైతులను ఎవరు ఆదుకోవాలి? దేశవ్యాప్తంగా రైతులు ఇప్పటికే పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలు, ద్రవ్యోల్బ ణం, ఆదాయ అభద్రతతో సతమత మవుతున్నారు. ఈ సమయంలో ఇలాంటి నిర్ణయం వెనుక గత కొన్ని రోజులుగా అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలతో కుదుర్చు కున్న వాణిజ్య ఒప్పందాలే కారణం. ఈ ఒప్పందాల నేపథ్యంలో, రాష్ట్రాలు రైతులకు అందిస్తున్న అదనపు ఆర్థిక సహాయాలను పరిమితం చేయాలన్న సూచనలు రావడం, అలాగే దిగుమతుల పెంపు దిశగా తీసుకుంటున్న చర్యలూ రైతు వర్గాల్లో ఆందోళనను పెంచుతోంది. అమెరికాలో భారీ సబ్సిడీలతో ఉత్పత్తి అయ్యే పంటలు తక్కువ ధరలకు అంతర్జాతీయ మార్కెట్లలోకి వస్తాయి. అలాంటి పంటలను భారతదేశంలోకి దిగుమతి చేసుకుంటే, స్థానిక రైతులు పోటీపడటం చాలా కష్టం.
రైతు సంక్షేమంపై గతంలో అనేక కమిటీలు సూచనలు చేశాయి. ముఖ్యంగా స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు రైతు ఆదాయాన్ని పెంచడానికి కీలకమైన మార్గదర్శకంగా నిలిచాయి. తాము అధికారంలోకి వస్తే రైతుకు రెట్టింపు ఆదాయం కల్పిస్తామని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేస్తామని ఇచ్చిన హామీని ఈ పన్నెండేళ్లలో బీజేపీ ప్రభుత్వం అమలు చేయలేదు. పైగా మూడు నల్లచట్టాలను తెచ్చి వ్యవసాయాన్ని కార్పొరేట్‌కు అప్పగించాలని చూసింది. చివరికి రైతు సంఘాల ఉద్యమంతో వెనక్కుతీసుకుంది. ఎమ్మెస్పీకి చట్టబద్ధత కల్పిస్తామని ఇచ్చిన హామీకి ఎసరుపెట్టింది. బీజేపీ వ్యతిరేక ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లో రైతులకు అదనపు ఆర్థికసాయాన్ని అందిస్తున్నాయి. అదనపు బోనస్‌లు, ప్రోత్సాహ కాలు కొంతవరకు భరోసాను కల్పిస్తున్నాయి. కానీ, వాటినెత్తివే యాలని కేంద్రం సూచించ డం రైతులకందే కొద్దిపాటి సాయాన్ని కూడా దెబ్బతీయడమే. కేంద్రం చర్యలను అడ్డుకునే క్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కెఎమ్) రాష్ట్రపతికి లేఖ రాసింది. వరి, గోధుమ రైతులకు ఇచ్చే బోనస్‌ను రద్దు చేస్తూ డెమి-అఫీషియల్ ఆర్డర్ (డీవో) లేఖను ఉపసంహరించుకునేలా ఆర్థికమంత్రిని ఆదేశిం చాలని కోరింది. అంతేగాకుండా రైతువ్యతిరేక చర్యలను కేంద్రం మానుకోవాలని, అమెరికా, ఇతర దేశాలతో చేసుకో బోయే వాణిజ్య ఒప్పందాల వల్ల మన రైతులు తీవ్రంగా నష్టపోతారని ప్రధానిమోడీకి చెప్పాలని కోరింది. వ్యవసాయం, చిన్న తరహా ఉత్పత్తిని నాశనం చేసే వాణిజ్య ఒప్పందంపై అమెరికాతో సంతకం చేయవద్దని ఆదేశించాలని పేర్కొంది. రైతు వ్యతిరేక నిర్ణయాలు తీసుకోవడంలో బీజేపీ ప్రభుత్వం ముందుంది. రైతు బతికితేనే దేశం బతుకుతుందన్న నిజాన్ని గుర్తించాలి. లేదంటే వ్యవసాయ రంగాన్ని కాపాడే నిర్ణయాల అమలునకు ప్రజలే ఉద్యమించాలి.

## "నోబుల్ మైండ్స్ ఒలింపియాడ్లో శర్వాణి విద్యార్థికి రాష్ట్రస్థాయి రెండవ బహుమతి"

మొదటిపేజీ తరువాయి

విద్యాలయలో 9వ తరగతి చదువుతున్న ఆర్. జైగణేష్ రాష్ట్రస్థాయి రెండవ బహుమతి సాధించారు. తనతో పాటు మరో 19 మంది వివిధ తరగతులకు చెందిన విద్యార్థులు ప్రత్యేక బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా జైగణేష్ ను, ఇతర విద్యార్థులను, శర్వాణి విద్యాలయ వ్యవస్థాపకులు అంధవరపు సూరిబాబు అభినందిస్తూ ఈ విజయం తమ సంస్థపై, మరీ ముఖ్యంగా తమపై, తమ ఉపాధ్యాయులపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రతిష్టాత్మక ర్యాంకులను తమ విద్యార్థులు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సాధారణ పాఠ్యాంశాలతోపాటు ఏ విధమైన అదనపు రుసుం వసూలు చేయకుండా టెక్నో కాంపిటీటివ్ కరిక్యులమ్ను ప్రణాళికాబద్ధంగా విద్యార్థులకు బోధించడంవలన ఇటువంటి సత్ఫలితాలను సాధించగల్గుతున్నామని సూరిబాబు తెలిపారు.
కార్యక్రమములో నోబుల్ మైండ్స్ వారు అందజేసిన బహుమతులను సూరిబాబు జైగణేష్ కు, ఇతర విద్యార్థులకు ప్రదానం చేశారు.
కార్యక్రమంలో భాగంగా కరెస్పాండెంట్ ఎ. ఆంజనేయులు, హెడ్మిస్ట్రెస్ డా.కె. రేఖ విద్యార్థులను ప్రశంసించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 99టీవీ స్టూడియో ఆవిష్కరణలో చిరంజీవితో దువ్వాడ భేటీ

- హైదరాబాద్‌లో ఘనంగా 99టీవీ కొత్త స్టూడియో ప్రారంభం
- ముఖ్య అతిథిగా హాజరైన మెగాస్టార్ చిరంజీవి
- ప్రజారాజ్యం రోజుల్ని గుర్తుచేసుకుంటూ ఆత్మీయ సంభాషణ
- 99టీవీ యజమాని తోట చంద్రశేఖర్‌తో దువ్వాడ చిట్‌చాట్



**నవతరం :**

హైదరాబాద్‌లో 99టీవీ నూతన స్టూడియో కాంప్లెక్స్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెగాస్టార్ చిరంజీవి గారు హాజరై స్టూడియోను ప్రారంభించారు. అదే సందర్భంలో ఉగాది పురస్కారాలను కూడా ప్రదానం చేశారు.
ఈ వేడుకలో దువ్వాడ శ్రీనివాస్ పాల్గొని చిరంజీవి గారిని ఆత్మీయంగా కలిశారు. ఈ సందర్భంగా చిరంజీవి గారు దువ్వాడను సంతోషంగా పలకరించి, ప్రజారాజ్యం పార్టీ రోజులను గుర్తుచేసుకుంటూ పాత జ్ఞాపకాలను పంచుకున్నారు. ఇరువురు పలు సమకాలీన అంశాలపై చర్చించుకున్నారు.
తదుపరి 99టీవీ యజమాని తోట చంద్రశేఖర్ గారితో దువ్వాడ శ్రీనివాస్ గారు చిట్‌చాట్ నిర్వహించారు. కార్యక్రమం మొత్తం ఆత్మీయ వాతావరణంలో సాగింది.

## బత్తులలకు గౌరవ డాక్టరేట్

- కరోనా సమయంలో అందించిన సేవలకు గుర్తింపు

**నవతరం శ్రీకాకుళం**

సుదీర్ఘ కాలం పాటు ప్రభుత్వ ఉద్యోగం రిమ్స్ లో రేడియోగ్రాఫర్ గా పనిచేసి పదవి విరమణ పొందిన బత్తుల సత్యనారాయణకు చేయూత సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ వారు గౌరవ డాక్టరేట్ను అందజేశారు. కోవిడ్ సమయంలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను అంతకుముందు టీవీ విభాగాల్లో విషెస్ సేవలందించి ఎంతో మంది రోగులకు ప్రాణదానం చేసినందుకు గుర్తించి ఈ అవార్డును అందజేశా రు. ఈ అవార్డు ను చేయూత సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ డే స్ప్రింగ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ యూఎస్ఏ మరియు ఇండియా సంయుక్తంగా నిర్వహిస్తున్న సంస్థ గురువారం విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరీ ద్వారకా నగర్ లో సోషల్ వర్క్ విభాగంలో గౌరవ డాక్టరేట్ ను అందజేశారు. ఈ అవార్డు సంస్థ అధినేతలు ఇంటర్నేషనల్ యూనివర్సిటీ వీసీ ఎతీ ఆమోద్ జేమ్స్, యూనివర్ సిటీ హెడ్ భీషప్, పట్టిపాటి ప్రభాకర్ రావు, చేయూత సోషల్ ఆర్గనైజషన్ అడ్వకేట్ లక్ష్మణరావు, ఉమా మేడం, తదితరులు అందజేశారు. అవార్డు రావడం పట్ల శు భాకాంక్షలు తెలిపారు.



## బీజేపీ కార్యాలయంలో ఉగాది వేడుకలు

- జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహణ
- పూజలు, పంచాంగ శ్రవణంతో ఉత్సాహంగా వేడుకలు
- వికసిత ఆంధ్రప్రదేశ్ దిశగా ముందుకు సాగాలని పిలుపు



**నవతరం శ్రీకాకుళం**

శ్రీకాకుళం జిల్లా బీజేపీ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు గారి ఆధ్వర్యంలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా తేజేశ్వరరావు గారు ముందుగా పూజ కార్యక్రమం నిర్వహించి, అనంతరం పంతులు గారి ద్వారా పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఉగాది పచ్చడిలోని షడ్రుచుల సమ్మేళనంలా ప్రతి ఒక్కరి జీవితం సకల శు భాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే వికసిత ఆంధ్రప్రదేశ్ సాధన దిశగా అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిస్తూ, తెలుగు ప్రజలందరికీ ఉగాది శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు.

## ముఖ్యమంత్రిగా ఉమాకవి... ప్రతిస్పందన స్కిట్‌కు ప్రశంసలు

- ఉగాది కవి సమ్మేళనంలో సామాజిక సందేశంతో స్కిట్ ప్రదర్శన
- అవినీతిపై గట్టి సందేశం ఇచ్చిన 'ప్రతిస్పందన' నాటిక
- కళాకారుల బృందానికి కవులు, ప్రముఖుల అభినందనలు



**నవతరం శ్రీకాకుళం**

తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా కవి సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాహితీ చైతన్య కిరణాలు, బాల కథానిలయం అధ్యక్షుడు, శ్రీశ్రీ కళావేదిక శ్రీకాకుళం జిల్లా కన్వీనర్ భోగెల ఉమామహేశ్వరరావు (ఉమాకవి) దర్శకత్వంలో 'ప్రతిస్పందన' అనే సామాజిక సందేశంతో కూడిన స్కిట్‌ను ప్రదర్శించారు. ఈ స్కిట్‌లో ముఖ్యమంత్రిగా ఉమామహేశ్వరరావు నటించగా, గురువుగా ఐ.ఎన్.డి ప్రసాద్, సూపరింటెండెం ట్‌గా ఇద్ది పాపయ్య, విద్యార్థులుగా తాళ్లూరి విజయ లక్ష్మణ్, బాలాజీ రవికిరణ్, మణిపాత్రుని తిరుమల, జగన్నాథం మాస్టారు తదితరులు పాల్గొన్నారు. స్కిట్ ప్రధాన ఇతివృత్తం ఒక ఉత్తమ ఉపాధ్యాయుడు పెన్షన్ కోసం తిరుగుతూ ఎదుర్కొనే అవినీతి వ్యవస్థపై ఆధారపడి ఉంది.
సూపరింటెండెంట్ లంచం కోరడంతో ఆవేదన చెందిన ఉపాధ్యాయుడు తన శిష్యుడైన ముఖ్యమంత్రిని ఆశ్రయిస్తాడు. వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి అవినీతిపరుడైన అధికారిని ఉద్యోగం నుంచి తొలగించి, ఉపాధ్యాయుడికి రావాల్సిన పెన్షన్‌ను అందజేయాలని ఆదేశించడం ద్వారా న్యాయం జరిగేలా చూపించారు. ఈ 'ప్రతిస్పందన' స్కిట్ ప్రేక్షకులను ఆకట్టుకుని, కవులు, కళాకారులు ఉమామహేశ్వరరావు బృందాన్ని అభినందించారు. అనంతరం తోట గోపాలరావు రచించిన 'తోట వారి కథలు', 'స్పందన' కవితా పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉమామహేశ్వరరావు, ఇద్ది పాపయ్య, ఐ.ఎన్.డి ప్రసాద్ రావులను ఎచ్చెర్ల అంబేద్కర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ శ్రీమతి కె. రజిని చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు.

# “మూడు పండుగలు... ఒకే భావం” – చిన్న కథ



ఒక చిన్న పట్టణంలో మూడు కుటుంబాలు
పక్కపక్కనే నివసించేవి.
వారి ఆచారాలు వేరు... కానీ వారి హృదయాలు
దగ్గరగా ఉండేవి.
ఉగాది రోజు ఉదయం...
ఒక ఇంటి ముందు మామిడి తొరణాలు,
రంగవల్లులు అలంకరించి ఉండగా,
అక్కడి చిన్నారి ఆనందంగా చెప్పింది –
“ఉగాది ఉదయం కొత్త ఆశల వెలుగు ??”
కొన్ని రోజుల తరువాత... రంజాన్ వచ్చింది.
రాత్రి ఆకాశంలో చంద్రుడు కనిపించగానే,
మరొక ఇంటి పెద్దలు ప్రార్థనలో
మునిగిపోయారు.
ఆ సమయంలో పక్కింటి పిల్లాడు నిశ్శబ్దంగా
అన్నాడు –
“రంజాన్ రాత్రి మనసుకు శాంతి వెలుగు ??”
ఇంకా కొంతకాలానికి ఈస్టర్ వచ్చింది.
ఉదయం చర్చి గంటలు మోగుతుండగా,
మూడో ఇంటి అమ్మాయి చిరునవ్వుతో చెప్పింది
“ఈస్టర్ ఉదయం కొత్త జీవితం వెలుగు ??”
ఆ రోజు సాయంత్రం... ముగ్గురు పిల్లలు కలిసి
ఆడుకుంటూ,
ఒకరినొకరు చూసి నవ్వుకున్నారు.
అప్పుడు వారిలో ఒకడు నెమ్మదిగా అన్నాడు –
“మూడు పండుగలు... ఒకటే మనసు ??”
వారి తల్లిదండ్రులు కూడా ఒకచోట కూర్చొని
మాట్లాడుకుంటూ,
జీవితంలో అసలు విలువ ఏమిటో గ్రహించారు
“అవగాహన, సహనం, విశ్వాసం కలిసిన
మార్గం ?
మతాలు వేరైనా... భావం మాత్రం ఒకటే ??”
ఆ చిన్న వీధి... ఒక పెద్ద పాఠం నేర్పింది –
పండుగలు మారినా... మనుషుల మధ్య ఉన్న
అనుబంధం మాత్రం ఎప్పటికీ ఒకటే అని.

రచన: తేరాల రాజేంద్రప్రసాద్
మీసేవ గిరి నగర్ హైదరాబాద్ – 37
చరవాణి: 9297109223

# వికసించిన ప్రతిభా పారిజాతం శ్రీ దూసి ధర్మారావు

– విశ్రాంత జెసి పి .రజనీకాంత రావు

**నవతరం –శ్రీకాకుళం**




వికసించిన ప్రతిభా పారిజాతం శ్రీ దూసి ధర్మారావు అని, విశ్రాంత జెసి పి .రజనీకాంత రావు అన్నారు. స్థానిక రెడ్ క్రాస్ నైపుణ్యాభివృద్ధి భవనంలో దూసి ధర్మారావు జయంతి ఉత్సవాలాను ఘనంగా నిర్వహించారు. తరని కృష్ణ స్మారక ధార్మిక సేవా ట్రస్ట్ చైర్మన్ మండ.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అతిధులు, వక్తలు పాల్గొని మాట్లాడుతూ ఆశయసాధన లక్ష్యంతో 2019లో ఫౌండేషన్ ఏర్పడిందని, శ్రీకాకుళం జిల్లా సాంస్కృతిక వికాసంలో ప్రాచీన ఆర్ష గ్రంధాల భాండాగారం, ఉపనిషన్మందిరం పునరుద్దరణ, నాగావళీ తీరంలో తేజోమూర్తుల విగ్రహాల స్థాపన, యునెస్కో వరకూ వినిపించే జానపద కళారూపాల పరిరక్షణ, జాతీయ తాళపత్రాల సేకరణ, తీరప్రాంతాల సంస్కృతీ పరిరక్షణలో అహర్నిశలు ఆయన కృషిచేశారన్నారు. అతిధి డా. సుదీర్, రెడ్ క్రాస్ చైర్మన్ పి .జగన్ మోహన్ రావు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా కీర్తిప్రతిష్టలను జాతీయ, అంతర్జాతీయస్థాయిలో వివిధ రంగాలలో తమ అవిరళ కృషి ద్వారా వ్యాపింపజేసిన నిష్ణాతులను ప్రశంసించే దిశగా ఫౌండేషన్ పురస్కారాల ఏర్పాటు చేయబడ్డాయని, శ్రీకాకుళం కీర్తి గానాన్ని శిరసెత్తి పాడుకుంటూ సంస్కృతీ ప్రియులందరం చేయి చేయి కలిపి అడుగులు ముందుకేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగముగా లలిత సంగీత అమృతవర్షిణి, అందరినీ అలరించింది. తనయుడు కిషోర్ సౌజన్యంతొ జాలువరిన వెన్నెల గీతాల సుమ మాలిక, లలిత సంగీత అమృత వర్షిణి, ఆకాశవాణి కళాకారులు బండారు రమణ మూర్తి స్వర సారద్యంలో వీనుల విందుగా జరిగింది. ధర్మారావు రచించిన పలు గీతాలను బండారు రమణమూర్తి సంగీత సారధ్యంలో గాయకులు ఆలపించారు. అనంతరం అతిథుల చేతులమీదుగా దూసి ధర్మారావు ఫౌండేషన్ పురస్కారాల కింద కళా పురస్కారం దూసి కనక మహాలక్ష్మికి, సాహితీ పురస్కారం కంచరాన భుజంగరావుకి, సేవా పురస్కారం డాక్టర్ సంపత్ కుమార్ కు అందజేశారు.
కార్యక్రమంలో నిష్ఠల నరసింహమూర్తి, ఇంటాక్ కన్వీనర్ నూక.సన్యాసిరావు, నల్లి ధర్మారావు, ఎం.వి.కామేశ్వరరావు, దూసి వెంకట రమణమూర్తి, రెడ్డి సత్యనారాయణ, పవన్ కుమార్, సిమన్న, వెంకటేశ్వరి, ఉమ మహేశ్వరరావు, పెంకి నాగేశ్వరావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# అరసవల్లిలో ఉచిత సామూహిక అక్షరాభ్యాసం

**నవతరం శ్రీకాకుళం**

శ్రీకాకుళం జిల్లా అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో పరాభవ నామ సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని చిన్నారులకు ఉచిత సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర్ శర్మ మాట్లాడుతూ ఉగాది వంటి పర్వదినాల్లో స్వామివారి సన్నిధిలో అక్షరాభ్యాసం చేయించడం చిన్నారుల భవిష్యత్తుకు ఎంతో శుభప్రదమని పేర్కొన్నారు. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా మంత్రోచ్చారణల మధ్య చిన్నారులతో అక్షరాభ్యాసం నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో భక్తులు తమ పిల్లలతో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు.
దేవస్థానం తరపున చిన్నారులకు అవసరమైన పలకలు, బలపాలు, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు.



ఈ కార్యక్రమాన్ని దేవస్థానం డిప్యూటీ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి కె.ఎన్.వి.డి.వి ప్రసాద్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు.



# మొత్తానికి సమంతకు ఆ ఛాన్స్ సమీపిస్తోందా?

దక్షిణాదిలో స్టార్ హీరోయిన్‌గా తనదైన ముద్ర వేసిన సమంత బాలీవుడ్ వెండితెర ఎంట్రీ కోసం గత కొంతకాలంగా ఎదురు చూస్తోన్న సంగతి తెలిసిందే. ది ఫ్యామిలీ మ్యాన్ 2, సిటాడెల్: హనీ బన్నీ వంటి వెబ్ సిరీస్‌లతో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై సత్తా చాటినా? అది బుల్లి తెర కావడంతో? అమ్మడు సంతృప్తి చెందలేదు . ఒక భారీ హిందీ సినిమా ద్వారా థియేటర్లలో ప్రేక్షకులను పలకరించాలనే ప్రయత్నాలు చేస్తున్నా? సరైన ఛాన్సులు రాకపోవడంతో నీరిక్షణ తప్పలేదు.
తాజాగా సామ్ వెండి తెర ఎంట్రీకి సమయం ఆసన్నమైంది. బాలీవుడ్ అగ్ర నిర్మాత కరణ్ జోహార్ నిర్మాణంలో సిద్ధార్థ్ మల్హోత్రా హీరోగా రూపొందున్న కొత్త సినిమాలో సమంతను హీరోయిన్‌గా పరిశీలిస్తున్నట్లు తెలిసింది.
ది కార్గిల్ గర్ల్, మిస్టర్ అండ్ మిసెస్ మాహి వంటి చిత్రాలతో దర్శకుడిగా తన ప్రతిభను చాటుకున్న శరణ్ శర్మ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. కరణ్ జోహార్‌కు సమంతతో ఉన్న స్నేహం కారణంగా ఈ ఛాన్స్ దక్కుతున్నట్లు బాలీవుడ్ మీడియాలో వార్తలొస్తున్నాయి. మరికొన్ని రోజుల్లోనే ఛాన్స్ ఫైనల్ కానుందని సమాచారం. అదే నిజమైతే సమంత ఆనందానికి అవధులుండవ్. సమంత హిందీ సినిమాల్లో నటించాలని చాలా కాలంగా ఎదురు చూస్తోంది. మధ్యలో అనారోగ్య సమస్యలు , వ్యక్తిగత కారణాల వల్ల కొన్నాళ్లు విరామం తీసుకున్నప్పటికీ, ఆమె క్రేజ్ మాత్రం తగ్గలేదు.
ఇటీవలే బాలీవుడ్ దర్శక, నిర్మాత రాజ్ నిడిమోరును వివాహం చేసుకోవడం అమ్మడికి కెరీర్ పరంగానూ కొంత కలిసొచ్చిందని చెప్పొచ్చు. భర్త వైపు నుంచి కూడా కొత్త అవకాశాలు రావడానికి ఛాన్స్ ఉంది. ఇప్పటికే ముంబైలో ఖరీదైన ఇంటిని కూడా కొనుగోలు చేసిన సమంత మకాంను పూర్తిగా బాలీవుడ్‌కు మార్చేసింది. సిద్ధార్థ్ మల్హోత్రా వంటి హ్యాండ్సమ్ హీరో సరసన ఆమె జోడీ కడితే బాలీవుడ్‌లో ఒక ఫ్రెష్ అండ్ క్రేజీ కాంబినేషన్ అవుతుంద నడంలో ఎలాంటి సందేహం లేదు.
ది రివెంజ్ శరణ్ శర్మ చిత్రాలు భావోద్వేగాలతో కూడిన కథాంశంతో ఉంటాయి. దీంతో సమంత లాంచింగ్ ఇదే పర్ఫెక్ట్ స్టోరీ అవుతుందని అభిమానులు భావిస్తున్నారు. ఇప్పటికే హిందీ భాషపై అమ్మడు పట్టు సాధించింది. అక్కడి ప్రేక్షకు లకు నటనతో మరింత దగ్గరవ్వాలని ఆశపడుతోంది. ధర్మ ప్రొడక్షన్స్ లాంటి పెద్ద బ్యానర్ లో లాంచ్ అయితే? వచ్చే గుర్తింపు కూడా ఎంతో ప్రత్యేకంగా ఉంటుంది.
హబ్బీ రాజ్ నిడిమోరు సహకారం కూడా అన్ని రకాలుగా దక్కుతుంది. ఇకపై భర్త దర్శకత్వంలో కూడా సినిమాలు చేయడానికి ఛాన్స్ ఉంటుంది. బాలీవుడ్ లో రాజ్ కున్న పరిచయాలతో మరిన్ని అవకాశాలకు ఛాన్స్ ఉంటుంది. మొత్తానికి సమంత బాలీవుడ్ ఎంట్రీ ఆలస్యమైనా? స్ట్రాంగ్ గానే కనిపిస్తుందని చెప్పొచ్చు.

# పెద్ది సాంగ్.. పెరిగిపోతున్న హీరోయిన్ల లిస్ట్

పాటలతో పెద్దిపై అంచనాలు పెరిగిపోయాయి. ఇప్పుడు మరో సాంగ్ పై విపరీతంగా చర్చ సాగుతోంది. అదే స్పెషల్ సాంగ్. సాధారణంగా ప్రత్యేక గీతాల్లో ఒక హీరోయిన్ కనిపిస్తుంది. కానీ పెద్ది కోసం మినిమం ముగ్గుర్ని తీసుకునే ఆలోచనలో ఉన్నాడట బుచ్చిబాబు.
సినిమాకు సంబంధించి ప్యాచ్ వర్క్ ను పక్కనపెడితే, ఈ సాంగ్ ఒక్కటే బ్యాలెన్స్. దీన్ని గ్రాండ్ గా షూట్ చేసి, ఫినిష్ చేయాలని భావిస్తున్నారు. ఎందుకంటే, ఈ పాట అంత బాగా వచ్చిందంట.
ఈ గ్యాప్ లో పెద్ది స్పెషల్ సాంగ్ లో చిందేసే హీరోయిన్లపై అప్పుడే ఊహాగానాలు మొదలయ్యాయి. పూజా హెగ్డే, మృణాల్ ఠాకూర్, ఆయేషా ఖాన్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీళ్లలో పూజాహెగ్డే-చరణ్ కాంబో ఆల్రెడీ పెద్ద హిట్. రంగస్థలం సినిమాలో ఐటెం సాంగ్ చేసింది పూజా హెగ్డే. అప్పట్లో ఆ పాట ఓ సంచలనం. ఇప్పుడు మరోసారి చరణ్ సినిమాలో ఆమె స్పెషల్ సాంగ్ కు దాదాపు ఫిక్స్ అయినట్టు తెలుస్తోంది. రీసెంట్ గా రజనీకాంత్ సినిమాలో ఆమె చేసిన ప్రత్యేక గీతం హిట్టవ్వడంతో, పెద్ది కోసం దాదాపు ఆమెను లాక్ చేశారు. మిగతా హీరోయిన్లు ఎవరనేది ప్రస్తుతానికి సస్పెన్స్. అటు యూనిట్ మాత్రం ప్రస్తుతానికి ఈ మేటర్ ను తాత్కాలికంగా పక్కన పెట్టింది. సినిమాకు సంబంధించిన ఒక చిన్న సీన్ తో పాటు, ప్యాచ్ వర్క్ పెండింగ్ ఉంది. ఇంకా చెప్పాలంటే అంతా కలిపి ఓ వారం రోజుల



పని. దాన్ని పూర్తిచేసిన తర్వాత ప్రశాంతంగా కూర్చొని ప్రత్యేక గీతంపై ఆలోచించాలనుకుంటున్నారు. ఇక ఈ సాంగ్ ను సరిగ్గా సినిమా రిలీజ్ ముందు వదలాలని ప్లాన్ చేస్తున్నారంట. ఎందుకంటే, రెహ్మాన్ కంపోజ్ చేసిన ఈ పాట అంత బాగా వచ్చిందంటున్నారు. చికిరి ఎంత పెద్ద హిట్టయిందో, సినిమా రిలీజ్ కు ముందు సోషల్ మీడియాలో ఈ ప్రత్యేక గీతం అంత పెద్ద హిట్టవుతుందని దర్శకుడు బుచ్చిబాబు నమ్మకంగా ఉన్నాడు.

# ఎంఎల్సీ నర్తు రామారావు క్యాంప్ కార్యాలయంలో ఉగాది వేడుకలు

- కొత్తపుట్టుగలో వైభవంగా నిర్వహించిన ఉగాది వేడుకలు
- నర్తు రామారావు దంపతులతో పాటు నేతల పాల్గొనడం
- వైఎస్ఆర్‌సీపీ నాయకత్వానికి, తెలుగు ప్రజలకు శుభాకాంక్షలు



**నవతరం శ్రీకాకుళం**

కొత్తపుట్టుగలోని ఎంఎల్సీ నర్తు రామారావు క్యాంప్ కార్యాలయంలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్తు రామారావు దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.
ఈ వేడుకలకు పైల దేవదాస్ రెడ్డి, బోర పుష్ప, పిలక సంతు, కడియాల పద్మ ప్రకాష్, మృత్యుంజయ, నేతాజీ, లడ్డు పాత్రో, చిట్టిబాబు, మామయ్య, రాజశేఖర్ తదితర నాయకులు, కార్యకర్తలు హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్తు రామారావు వైఎస్ఆర్‌సీపీ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు, అలాగే తెలుగు ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరం అందరికీ సుఖసంతోషాలు, అభివృద్ధి తీసుకురావాలని ఆకాంక్షించారు.

# యువ రచయితల వేదికలో “ఉగాది కవి సమ్మేళనం”

- యువ రచయితలకు తెలుగు భాషా మాధుర్యాన్ని తెలియజేస్తాం.
- యురవే అధ్యక్షురాలు తంగి.ఎర్రమ్మ




**నవతరం శ్రీకాకుళం**

యువ తెలుగు రచయితలను ప్రోత్సహించడానికి, యువరచయితల వేదిక ప్రోత్సాహాన్ని, మార్గదర్శకత్వం అందిస్తుందని, యురవే అధ్యక్షురాలు తంగి.ఎర్రమ్మ అన్నారు. స్థానిక జిల్లా గ్రంథాలయంలో ఉగాది కవి సమ్మేళనాన్ని యురవే ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఇందులో భాగముగా ఆమె మాట్లాడుతూ యురవే ముఖ్యంగా కొత్త తరం రచయితలను, కవులను, ముఖ్యంగా డిజిటల్, సాంఘిక ఇతివృత్తాలతో సాహిత్యం సృష్టించే వారిని ఆదరిస్తూ, వారి ప్రతిభకు గుర్తింపును, మార్గదర్శకత్వాన్ని అందిస్తుందని, యువ రచయితల ప్రతిభను పెంపొందించడం, కొత్త తరం రచయితలను, కవులను ప్రోత్సహించడం మన అందరిబాధ్యతన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా తెలుగు భాషా మాధుర్యాన్ని, కొత్త భావాలను అందిపుచ్చుకుంటున్నారని ఈ సందర్భంగా తెలిపారు.
భారతీయ వారసత్వం, సంస్కృతి, జ్ఞానాన్ని ప్రోత్సహించేలా వివిధ అంశాలపై రచనలు చేయగల రచయితలను అభివృద్ధి చేయడమే కాకుండా, వర్ధమాన యువత తమ మాతృభాషలో తమ భావాలను వ్యక్తీకరించడానికి, అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడానికి ఒక అవకాశాన్ని అందిస్తుందన్నారు. అనంతరం ఉగాది కవి సమ్మేళనంలో భాగముగా కవులు, తమ కవిత్వాలను చదివి వినిపించి, ఉగాది విశిష్టతను, ప్రాముఖ్యతను వివరించారు.
ఈ కార్యక్రమంలో కే జనార్ధన రావు, పేడాడ వేదవతి, సిహెచ్. సుబ్బలక్ష్మి, డాక్టర్ ఎంకే మిశ్రో, డాక్టర్ నరేష్ కుమార్, ఇ. తిరుపతి రాజ్, డాక్టర్ పి చిరంజీవి రావు, ఆర్.డిల్లేశ్వరరావు, గోపాలకృష్ణ, తెలంగాణ లింగరాజ్ , భాస్కరరావు, తేజస్విని, కాకర్ల నర్సింగరావు, ఉర్లం.శివతేజ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు

# డా. ఉదయబాబుకు ఉగాది పురస్కారం

- గిరిజన ప్రాంతాల్లో కొత్త వంగడాలు, చిరుధాన్యాల ప్రాచుర్యంలో విశేష సేవలు
- సీతంపేట, రాగోలు పరిశోధన కేంద్రాల అభివృద్ధిలో కీలక పాత్ర
- జీడిమామిడి తేయాకు దోమ నివారణలో ప్రత్యేక కృషి

**నవతరం శ్రీకాకుళం**

గిరిజన ప్రాంతాల్లో రైతుల అభివృద్ధికి విశేష కృషి చేసిన శాస్త్రవేత్త డా. పొన్నాడ ఉదయబాబు గారికి రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారం ప్రదానం చేసింది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి చేతుల మీదుగా ఈ అవార్డు అందజేశారు.డా. ఉదయబాబు గారు కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా గిరిజన రైతులకు కొత్త వంగడాలు, చిరుధాన్యాల పంటలపై అవగాహన కల్పిస్తూ, సాంకేతిక పద్ధతులను పరిచయం చేయడంలో ముఖ్య పాత్ర పోషించారు. ముఖ్యంగా సీతంపేట పరిశోధన స్థానం అధిపతిగా పనిచేసిన సమయంలో గిరిజన ప్రాంతాలకు అనువైన విత్తనోత్పత్తి చేపట్టి, కొత్త వంగడాలను పరిచయం చేయడం ద్వారా రైతులకు మేలు చేకూర్చారు. అలాగే ఉద్యానవన పంటల్లో జీడిమామిడి తేయాకు దోమ నివారణలో ఆయన చేసిన పరిశోధనలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా మారాయి. సీతంపేట పరిశోధన కేంద్రాన్ని అభివృద్ధి పరచడంలోనూ, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి ఉత్తమ పరిశోధన స్థానం అవార్డు సాధించడంలోనూ ఆయన కృషి కీలకం.తదుపరి రాగోలు వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతిగా బాధ్యతలు నిర్వహిస్తూ, ఉత్తర కోస్తా జిల్లాలకు అనువైన పంట వంగడాల రూపకల్పనలో విశేషంగా పనిచేశారు. రాష్ట్రవ్యాప్తంగా రైతుల పొలాల్లో వాటి ప్రయోగాత్మక అమలు జరగడంలోనూ ఆయన





ప్రధాన పాత్ర పోషించారు. ఈ క్రమంలో రాగోలు పరిశోధన స్థానం రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ పరిశోధన కేంద్రంగా గుర్తింపు పొందింది. వ్యవసాయ మరియు ఉద్యానవన శాఖల సమన్వయంతో రైతులకు శిక్షణా కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తూ అనేక సాంకేతిక అంశాలను చేరువ చేసినందుకు గాను డా. ఉదయబాబు గారికి ఈ గౌరవం దక్కింది.

# చౌధరి రాధాకృష్ణకు ఉగాది సాహితీ సింహా బిరుదు ప్రదానం

**నవతరం శ్రీకాకుళం**

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత, గాంధేయవాది, బహుముఖ ప్రజ్ఞాశాలి చౌధరి రాధాకృష్ణకు, పలాస కాశీబుగ్గ జనజాగృతి సభ్యులు ఉగాది సందర్భంగా సాహితీ సింహా బిరుదు ప్రదానం గావిస్తూ సన్మానించారు. జనజాగృతి సాహితీ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో రాధాకృష్ణను ఈ సత్కారానికి ఎంపిక చేశారు. జన జాగృతి సంస్థ దశమ వార్షికోత్సవం కూడా ఇదే వేదికపై నిర్వహించగా ఆయన ఈ గౌరవాన్ని పొందారు.
కాశీబుగ్గ గురుకుల విద్యాలయంలో ఈ ఉత్తరాంధ్ర కవిసమ్మేళనం నిర్వహించగా రాధాకృష్ణ పాల్గొని నేను స్వాప్నికుడిని అనే కవిత వినిపించి సభాసదుల ప్రశంసలు పొందారు. రాధాకృష్ణను సాహితీ సింహా బిరుదు ప్రదానం చేస్తూ పురస్కారాన్ని బహూకరిస్తూ జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ డా.తెప్పల కృష్ణమూర్తి, అధ్యక్షులు డా.కుమార్ నాయక్, ముఖ్య అతిథి విశ్రాంత రిజిస్ట్రార్ బట్ట నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బండారు కాళిదాసు, డా.రాజ్ కూమార్, డా.టి.ఆనంద్, గురుకుల విద్యాలయం కరస్పాండెంట్ కింతల అశోకవర్ధన్ తదితరులు శాలువా, పుష్పం ఫలం కలం పొత్తం జ్ఞాపిక



పుష్పమాల పగిడి ప్రశంసాపత్రాలతో ఘనంగా సన్మానించారు. గౌరవాధ్యక్షులు లఖినాన వెంకటాచలం, గౌరవ సలహాదారులు లయన్ ఎన్.అప్పారావు, బి.సుబ్బారావు, టి.మన్మథరావు, ఎం.లక్ష్మణరావు, పి.మల్లేశం, డా.జి.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు శ్రీనివాస బాబ్జి, సహాయ కార్యదర్శి బత్సల బాలరాజు, సాంస్కృతిక కార్యదర్శి భాష్యం రవికుమార్, సంగీత నృత్య శాఖల కార్యదర్శులు ఎం.ఉమామహేశ్వరి, జె.గజలక్ష్మి, టి.బాబూరావు తదితరులు పాల్గొన్నారు. రాధాకృష్ణ సాహితీ సింహ బిరుదు ప్రదానం పొందుట పట్ల పలువురు సాహితీవేత్తలు హర్షం వ్యక్తం చేసారు.

# పైడితల్లి అమ్మవారిని దర్శించిన బొత్స కుటుంబం

- ఉగాది సందర్భంగా విజయనగరంలో భక్తి వాతావరణం
- సకుటుంబంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బొత్స సత్యనారాయణ
- రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం సంకల్పం

**నవతరం విజయనగరం**

విజయనగరం, మార్చి 20: శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా ఉత్తరాంధ్ర ఆరాధ్యదైవం శ్రీ పైడితల్లి అమ్మవారిని మాజీ మంత్రి, ప్రస్తుత శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ సకుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణతో పాటు ఆయన ధర్మపత్ని, మాజీ పార్లమెంట్ సభ్యురాలు బొత్స ఝాన్సీ లక్ష్మి, కుమార్తె డాక్టర్ బొత్స అనూష ఆలయానికి విచ్చేశారు. ఆలయ ధర్మకర్తలు, అర్చకులు పూర్ణకుంభంతో సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అమ్మవారి గర్భగుడిలో జరిగిన ప్రత్యేక అర్చనల్లో బొత్స దంపతులు పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ధూపదీప నైవేద్యాలతో పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని వారు సంకల్పం వ్యక్తం చేశారు.



ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ అమ్మవారి అనుగ్రహంతో సమాజంలో ధర్మం వర్ధిల్లాలని, ప్రతి ఇంటా సుభిక్షం నెలకొనాలని ఆకాంక్షించారు. ఝాన్సీ లక్ష్మి ప్రత్యేక ప్రార్థనలు చేయగా, డాక్టర్ అనూష యువతలో ఆధ్యాత్మిక స్పృహ పెరగాల్సిన అవసరాన్ని పేర్కొన్నారు. బొత్స కుటుంబం ఆలయానికి చేరుకున్న వేళ అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి వారికి స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించి, వేద పండితుల ఆశీర్వాదాలు పొందారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**